క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



3వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక 3వ వార్డులో పారిశుధ్య పనులను కమిషనర్ పి.భవానీ ప్రసాద్‌తో కలిసి చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి గురువారం పరిశీలించారు. శానిటరీ పనుల నిర్వహణ, డ్రెయిన్ వ్యవస్థను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో సిల్ట్‌ను తొలగించి, వెంటనే మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బత్తిన చిన్న, కౌన్సిలర్ మేకా రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు సహాయం



అనిల్ వైద్యానికి సహాయాన్ని అందిస్తున్న గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ సభ్యులు

జంగారెడ్డిగూడెం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ అనిల్ వైద్యానికి స్థానిక గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం సభ్యులు గురువారం సహాయాన్ని అందించారు. ఆశ్రమం తరుపున రూ.20 వేలను అనిల్ స్నేహితులు కంచర్ల గణేష్, బల్లే రమణలకు అందజేశారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో అనిల్ వైద్యానికి సహకరించాలని ఆశ్రమం సభ్యులు కోరారు.

ఎమ్మెల్యే కృతజ్ఞతలు



ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : చింతలపూడి నియోజకవర్గ పరిధిలో 100 రోజుల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమం 100 రోజులు పూర్తిచేసుకోవడానికి తన వెంటే ఉంటూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సహకరించారని, ఇదేవిధంగా ముమ్ముందు కూడా సహకరించి రాబోయే ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా కృషి చేయాలని ఆయన కోరారు.

జలకళ బోరు నిర్మాణ పనుల ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెంలో జలకళ కార్యక్రమంలో భాగంగా బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పూర్తి స్థాయిలో సాగునీటి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురజాల పార్థసారథి, పారేపల్లి నాగేంద్రకుమార్, గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు బాక్సులను సద్వినియోగం చేసుకోండి

పోలవరం రూరల్ : పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు ఏ విధమైన సమస్యలు ఉన్నప్పటికీ లిఖితపూర్వకంగా ఈ బాక్సుల్లో వేస్తే వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు నుంచి మరి ఏదైనా సమస్యను కూడా తెలియజేయవచ్చన్నారు. 15 రోజులకు ఒకసారి ఆ పాఠశాలల్లోని బాక్సులను తెరిచి పరిశీలిస్తామన్నారు. ఈ పరిశీలనలో ఎంఈవో ఎస్.స్వరూప్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు కూడా పాల్గొంటారని తెలిపారు. ఫిర్యాదులు బాక్సులు పరిశీలించామని, ప్రస్తుతానికి ఫిర్యాదులు ఏవీ అందలేదన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కామవరపుకోట : ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్ అన్నారు. గురువారం కొత్తూరు సచివాలయంలో సచివాలయాల టౌన్ కన్వీనర్ పండు ప్రసన్న అధ్యక్షతన సచివాలయ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పింఛను వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా గ్రామంలోని ప్రతి కుటుంబానికి వెళ్లి గృహ సారథులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరిముల్లా, సచివాలయ కార్యదర్శి మనోజ్, అప్పారావు, మెడంకి చిన్న, మెరుగు బాబురావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఇంటి ముంగిటకే సంక్షేమ లబ్ధి

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కోడిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కోడిగూడెంలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హుల ఇళ్ల వద్దకే చేరుతోందని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కోడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ఇంటింటికి వెళ్లి, ప్రజా సమస్యలపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులెవరికైనా సాంకేతిక సమస్యలు కారణంగా పథకాలు అందకపోతే వెంటనే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, చెలికాని బుల్లియ్య, పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని సంజయ్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, సర్పంచ్ మానుకొండ ప్రసాద్, తాండ్ర చిన్ని, ఎంపీటీసీ మానుకొండ కన్నయ్య, మానుకొండ భీమయ్య, కేవీర్, మానుకొండ నాగేసు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, మండల సచివాలయాల కన్వీనర్ డీజే రాజు, మానుకొండ సుబ్బారావు, వేల్పూరి కల్యాణ్, దాకారపు అగ్గియ్య, పసుపులేటి ఏసుబాబు, దాసరి ఏసురత్నం తదితరులున్నారు.

వేడుకగా నరసన్న కల్యాణోత్సవాలు





సుందరగిరిపై విశేష పూజలందుకుంటున్న నరసన్న, నారసింహుని ఆలయ ఆవరణలో ప్రాణాచారాలు పడిన మహిళలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం అర్చకులు, పండితులు ఆలయంలో నిత్యహోమములు, మూలమంత్ర హవనములు, బలిహరణ, వేదపారాయణ ఔపాసన మండప పూజలు చేసి, స్వామి, అమ్మవార్లకు హారతి, మంత్రపుష్పములు సమర్పించారు. సాయంత్రం మూలమంత్ర హవనములు, బలిహరణలు, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాణాచారాలు

సంతానం కోసం పలువురు మహిళలు ఉదయం ఆలయ ప్రాంగణంలో ఆకుంటిత దీక్షతో ప్రాణాచారాలు నిర్వహించారు. తొలుత వారంతా నారసింహుడిని దర్శించుకున్నారు. అనంతరం సుందరగిరిపై పాలపొంగళ్లను వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. తడిదుస్తులతో ఆలయం వెనుక ప్రాణాచారం పడ్డారు. సాయంత్రం వరకు ఆ మహిళలు నరసింహుని స్మరిస్తూ ఉపవాస దీక్ష చేశారు. ఇలా చేయడంవల్ల వారికి స్వామివారు మదిలో సాక్షాత్కరించి కోరిన కోర్కెలను తీరుస్తాడని భక్తుల నమ్మకం. వారు నవగ్రహ పూజలు కూడా చేశారు.

నేడు నారసింహుని కల్యాణం

సుందరగిరి కొండ దిగువనున్న కల్యాణ మండపంలో నరసన్న దివ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం 11.10 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ త్రినాథరావు కోరారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



ఈ–పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నాగకుమార్

టి.నరసాపురం : రబీ 2023 సీజన్‌కు సంబంధించి ఈ–పంట నమోదు ప్రక్రియను క్షేత్ర పర్యటన ద్వారా పరిశీలిస్తున్నట్లు చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని తెడ్లం, రాజుపోతేపల్లి, కేతవరం, బంధంచర్ల, టి.నరసాపురం, గుర్వాయిగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ–పంట నమోదు గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులు చేస్తున్నారా లేదా, సరైన ప్రక్రియలోనే ఈ–పంట నమోదు జరుగుతుందా అనే అంశాలను తనిఖీ చేసినట్లు నాగకుమార్ తెలిపారు. సాగు చేసే ప్రతి పంటకు ఈ–పంట నమోదు తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలు త్వరలోనే పూర్తిచేసి వాటి ద్వారానే రైతులకు సేవలు అందించాలన్నారు. గ్రామంలో అసలు భూమి లేని కౌలు సాగు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు అందించాలన్నారు. రైతు భరోసా పథకంలో కౌలు సాగుదారులను నమోదుచేసి వారికి కూడా పథకం వర్తింపచేయాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో అందరు రైతులను నమోదు చేసి వారికి ఈ–కేవైసీ చేసి పీఎం కిసాన్ సొమ్ములు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మడల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ విధులకు ఆటంకం



సచివాలయం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

టి.నరసాపురం : సచివాలయ మహిళాపోలీస్ విధులను అడ్డగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం గ్రామ సచివాలయంలో బత్తుల గంగారత్నం మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. పోలీసు అధికారుల ఉత్తర్వులు మేరకు ఆమె పంచాయతీ పరిధిలో కోడిపందేల నిర్వహణ, కోడికత్తులు కట్టే వారి వివరాల సేకరణ, పేకాటల నిర్వహణ, నాటుసారా తయారీదారుల సమాచారం సేకరిస్తోంది. ఆ విధంగా గురువారం గ్రామంలో సమాచారం సేకరించి తిరిగి సచివాలయం వద్దకు వచ్చిన సమయంలో అల్లంచర్ల కొత్తగూడెం గ్రామానికి చెందిన గుండ్ర నాగరాజు అనే వ్యక్తి సచివాలయం వద్దకు వచ్చి మహిళాపోలీసును బెదిరించి ఆమె విధులకు ఆటంకం కలిగించి కులం పేరుతో ఆమెను దూషించి భయభ్రాంతులకు గురిచేశాడు. మహిళా పోలీసు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు, ఈ కేసును పోలవరం డీఎస్పీ లలితకుమారి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ముగిసిన మరియతల్లి ఉత్సవాలు



అల్లిపల్లి మరియతల్లి ఉత్సవాల్లో పాల్గొన్న ఏలూరు పీఠాధిపతి పొలిమెర జయరావు

చింతలపూడి : చింతలపూడి మండలం అల్లిపల్లి కొండపై వేలాది మంది భక్తుల ప్రార్థనల మధ్య జరిగిన మరియతల్లి ఉత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. మూడు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను జరిపారు. మరియతల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఏలూరు పీఠాధిపతి (బిషప్) పొలిమెర జయరావు దీవించారు. క్రైస్తవ వాక్యంలోని దివ్య సందేశాలను భక్తులు గ్రహించి పరివర్తనతో ముందుకు సాగాలని అన్నారు. అనంతరం పలువురు గురువులచే సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఖమ్మం, కృష్ణా , గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కూడా మేరీమాత భక్తులు ఈ ఉత్సవాలకు భారీగా తరలి వచ్చారు.

ఉపాధి పనుల్లో అవకతవకలుంటే చర్యలు



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

టి.నరసాపురం : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ డి.రాంబాబు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని హెచ్చరించారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో చేసిన రూ.26 కోట్లకు సంబంధించిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది పనులు సక్రమంగా చేయాలని, కూలీలు పని అడిగిన వెంటనే గ్రామాల్లో పనులు చూపాలని సూచించారు. పనులు తరచూ పర్యవేక్షిస్తామని, అవకతవకలను గుర్తిస్తే వెంటనే చర్యలు ఉంటాయన్నారు. మండలంలోని 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు మస్టర్ నిర్వహణ సక్రమంగా నిర్వహించలేదని గుర్తించి వారి వద్ద నుంచి రూ.46వేల రికవరీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ పురుషోత్తం, ఎస్‌ఆర్‌పీ ఔలయ్య, ఎంపీడీవో స్వామి, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, ఏపీవో ఎల్.శ్రీనివాస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవాదృక్పథం



లక్ష్మికి పింఛన్‌ను అందస్తున్న వలంటీర్ ప్రవళిక

జంగారెడ్డిగూడెం రూరల్ : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడికి 50 కిలోమీటర్ల మేర ప్రయాణించి పింఛన్ సొమ్మును అందించి సేవా దృక్పథాన్ని చాటుకుంది జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ కట్టా రేవతి. తానెంకి కన్నయ్య ఏలూరులో గుడ్ సమరిటన్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ రేవతి గురువారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధుడికి పింఛన్ సొమ్మును అందజేసింది.

వలంటీర్ ఔదార్యం

కామవరపుకోట : మండలంలో కళ్ళచెరువు గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో ఉండటంతో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామక్లస్టర్ వలంటీర్ ఎన్.ప్రవళిక నాలుగు నెలల బాలింత అయినా సరే తన క్లస్టర్ పరిధిలో ఉన్న ఎస్.లక్ష్మికి విశాఖపట్నం వెళ్లి రూ.5 వేల పింఛన్ నగదు ఇచ్చి తన ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించింది. బాలింత అయినా తన ఔదార్యాన్ని చాటుకుంది. లక్ష్మి కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞత తెలిపారు.



వృద్ధుడికి పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ రేవతి →

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ద్వారకాతిరుమల : భూ వివాదంపై స్పందనలో విచారణ జరుగుతుండగా ఆ భూమికి సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులో అక్రమంగా ఒక వ్యక్తి పేరును చేర్చిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ జి.సుందర్‌సింగ్‌కు బాధిత రైతు గురువారం ఫిర్యాదు చేశాడు. వివరాలు ప్రకారం. తాడేపల్లిగూడెం మండలం తాళ్లముదునూరుపాడుకు చెందిన క్లోపల్లి వెంకట లింగంకు ద్వారకాతిరుమల మండలం నారాయణపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్ నంబర్ 603/1 లో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అయితే సరిహద్దు రైతులైన లాయి నాగేశ్వరరావు, బండారు నాగులు తన భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఎఫ్ ల్యాండ్, సర్వే రిపోర్టు, వీఆర్వో రిపోర్టులు ఏమీ లేకుండా సవరణ దస్తావేజులో హద్దులు, సర్వే నెంబర్ మార్చి 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై గతేడాది డిసెంబర్ 12న జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్టు రైతు వెంకట లింగం తహసీల్దార్‌కు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్పందన ఫిర్యాదుపై విచారణ జరుగుతుండగా సంబంధిత వీఆర్వో వివాదాస్పద భూమికి సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులో లాయి నాగేశ్వరరావు పేరు ఎలా ఎక్కించాడని బాధిత రైతు ప్రశ్నిస్తున్నాడు. తన స్వలాభం కోసం వీఆర్వో చేసిన పని వల్ల తీరని నష్టం జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులు వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని రైతు వెంకట లింగం కోరుతున్నాడు.

5 నుంచి 9 వరకు జాతర మహోత్సవాలు

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలో గల గద్దెరాజులు, గుబ్బల మంగమ్మతల్లి, దుర్గమ్మ తల్లుల జాతర మహోత్సవాలను ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వర్సా పుల్లారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాగశుద్ధ పౌర్ణమి నాడు గద్దెరాజులు, అమ్మవార్లకు జాతర మహోత్సవాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. 5వ తేదీ అమ్మవారికి పసుపుకుంకుమ పూజ, అదేవిధంగా వర్సా వారి ఇలవేల్పైన గద్దె రాజులు, గుబ్బల మంగమ్మతల్లి, దుర్గమ్మ అమ్మవార్లను రాజపట్నం పోసి మేళతాళాల సంబరాలతో గద్దెకు తీసుకురావడం జరుగుతుందన్నారు. సాయంత్రం 3 గంటలకు అడవిలోకి తీసుకువచ్చి గద్దెరాజుకు సమర్పించి పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. 6వ తేదీన విశేష సర్వమంత్ర పూజా కార్యక్రమం, 7న పసుపుకుంకుమ, సౌభాగ్య పూజా, 8న వన భోజనాల సంబరాలతో పాటు రాత్రి అమ్మవారి చరిత్రలు చెప్పబడతాయని చెప్పారు. 9వ తేదీ అమ్మవారికి పీర్లు చేయడంతో పాటు పుట్టింటి చీర, సారె, కావిడతో అమ్మవారికి మొక్కులు సమర్పిస్తారని చెప్పారు. భక్తులు పాల్గొని జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి కృషి



వై. ముసలయ్య

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ఆదేశాలతో కేఆర్‌పురం ఐటీడీఏ సహకారంతో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక కృషి చేయనున్నట్లు ఏపీసీఎన్ఎఫ్ కేఆర్‌పురం జోనల్ కోఆర్డినేటర్ వై.ముసలయ్య తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నామని చెప్పారు. కేఆర్‌పురం డివిజన్ పరిధిలో సుమారు 15 వేల మందికి పైగా రైతులు 9,400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. వరి, ప్రత్తి, జీడిమామిడి, పెసలు, మినుము, మొక్కజొన్న, నవధాన్యాల పంటలు పండిస్తూ లాభాలు పొందుతున్నారన్నారు. అలాగే 200 ఎకరాలకు పైగా కూరగాయల సాగును చేస్తున్నారని చెప్పారు. పొట్లకాయ, ఆనపకాయ, దోసకాయ, చిక్కుడు, బీర, టమాట వంటి పంటలు పండిస్తూ ఆదాయాలు పొందుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రత్యేకమైన ప్రణాళికలతో గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాభివృద్ధికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు విద్యార్థిని ఎంపిక



మిత్రవిందను అభినందించిన ఉపాధ్యాయులు

లింగపాలెం : కొత్తపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని వడ్లాని మిత్రవింద నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం పీడీ ఎ.కామేష్ గురువారం విలేకర్లకు తెలిపారు. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు కాకినాడ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ – 14 విభాగంలో మిత్రవింద అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. త్వరలో జరిగే నేషనల్ బేస్‌బాల్ పోటీలో ఆమె పాల్గొంటారన్నారు. మిత్రవిందను స్కూల్ హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందించారు.

మరపట్లకు నేషనల్ ఫెలోషిప్ అవార్డు



మరపట్ల చినరాజు

పోలవరం రూరల్ : గూటాల గ్రామానికి చెందిన మరపట్ల చినరాజు నేషనల్ ఫెలోషిప్ అవార్డు సాధించారు. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత సాధించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైనట్లు రాజు గురువారం తెలిపారు. ఎంఏ తెలుగు పండిట్ చేశానని, ఉన్నత విద్యకు సంబంధించి కేంద్రం ప్రతి ఏటా నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటి ఎంట్రన్స్ టెస్ట్‌లో 6 సార్లు అర్హత సాధించినట్లు తెలిపారు. 7వ సారి ఉత్తీర్ణత సాధించి జాతీయ ఫెలోషిప్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాజు తల్లిదండ్రులు మరపట్ల చిన కొండలరావు (ఏలియ), కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్లను అందజేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక జెడ్పీ హైస్కూల్, బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఇద్దరికి గురువారం వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేశారు. దాతలు రాట్నాల లక్ష్మి కుమార్తెలు హిమబిందు, శ్వేతబిందు వితరణతో బాలికల హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య, జెడ్పీ హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి షేక్ హఫ్సానాకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు, కౌన్సిలర్ తాతాజీ, కౌన్సిలర్‌లు నంబూరి రామచంద్రరాజు, మానవత మూర్తి, పాములపర్తి శ్రీనివాసరావు, మేకా ఈశ్వరయ్య, పీసుపాటి రామలక్ష్మి, షేక్ హసీనా, చిట్లూరి రాజ్యలక్ష్మి, వలవల మేరీ సుశీల, హెచ్‌ఎంలు గెడ జగ్గారావు, గ్లోరీ ప్రశాంతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, ట్రీకటింగ్ పనులు నిమిత్తం 33కేవీ కామవరపుకోట నుంచి 33కేవీ లక్కవరం వెళ్లే లైను పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పట్టిసంలో రెండో దఫా సమావేశం

పోలవరం రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18వ తేదీన పట్టిశివక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లపై శుక్రవారం పట్టిసం శివక్షేత్రం వద్ద రెండవ దఫా సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి హాజరవుతారని, ఏర్పాట్లు చేపట్టే అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

మోపెడ్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ద్వారకాతిరుమల: టీవీఎస్ మోపెడ్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒక వృద్ధుడు తీవ్ర గాయాలు పాలయ్యాడు. ఈ ఘటన ద్వారకాతిరుమలలోని శ్రీవారి కొండపైకి వెళ్లే ఆర్చిగేటు కూడలిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని తిమ్మాపురానికి చెందిన వృద్ధుడు కొనికల్ల వెంకటేశ్వరరావు ద్వారకాతిరుమలలోని వీఆర్ఎం ఫంక్షన్ హాలులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై కొండపైన శ్రీవారి అన్నదాన భవనం వద్దకు వెళుతుండగా గుడిసెంటర్ నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉంది.

సారా కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

పోలవరం రూరల్ : తోటగొంది గ్రామంలో సారా కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై ఎస్.పవన్‌కుమార్ తెలిపారు. మిడియం కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ఒక లీటరు సారా కలిగి ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ములగలంపల్లి గ్రామానికి చెందిన కొప్పుల వెంకన్న అనే వ్యక్తి వాడపల్లి కాలనీకి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వంకవారిగూడెం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో వెంకన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అతడిని జీలుగుమిల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా కలిగి ఉన్న ముగ్గురి అరెస్ట్

టి.నరసాపురం : కృష్ణాపురంలో నాటు సారా కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి వారిని చింతలపూడి కోర్టుకు పంపినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాపురం గ్రామ శివారులో నాటు సారా కలిగి ఉన్న జరబల వెంకటేశ్వరరావును, భూక్యా మంజియ్యను, దారవత్తు మీరమ్మలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి ఐదేసి లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.